క్లుప్తంగా

పీహెచ్‌సీ వైద్యుల సమ్మెకు సిబ్బంది మద్దతు



ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ వైద్య సిబ్బంది ఆందోళన

మెరకముడిదాం: తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ సమ్మెబాట పట్టిన పీహెచ్‌సీ వైద్యులకు సిబ్బంది మద్దతు తెలిపారు. సోమవారం స్థానిక పీహెచ్‌సీ వైద్య సిబ్బంది నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరై ప్రభుత్వ తీరును నిరసించారు. ప్రస్తుతం ఆస్పత్రుల్లో వైద్యులు లేకపోవడంతో రోగులకు సక్రమంగా సేవలందడం లేదన్నారు. వారి న్యాయమైన కోర్కెలు తీర్చి రోగులకు అందుబాటులోకి వైద్యులను తీసుకురావాలని కోరారు.

నేడు వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశం

చీపురుపల్లి/చీపురుపల్లి రూరల్: వైఎస్సార్ సీపీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం మంగళవారం నిర్వహిస్తున్నట్లు పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇప్పిలి అనంతం, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాస నాయుడు, పార్టీ గరివిడి మండల అధ్యక్షుడు మీసాల విశ్వేశ్వరరావులు ఓ ప్రకటనలో సోమవారం వెల్లడించారు. గరివిడిలోని పార్టీ క్యాంప్ కార్యాలయంలో మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశానికి శాసన మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ, పార్టీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌లు హాజరవుతున్నారని, పార్టీ నాయకులు, కార్యకర్తలంతా హాజరుకావాలని కోరారు.

ప్రోటోకాల్ ఉల్లంఘనపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం


మాట్లాడుతున్న ఎంపీపీ చలం నాయుడు

బొండపల్లి: ప్రోటోకాల్ ఉల్లంఘించిన అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని ఎంపీపీ చల్లా చలంనాయుడు తెలిపారు. ఇదే విషయమై ఆయన మండల కేంద్రం లోని తన చాంబర్‌లో సోమవారం మీడియా సమావేశం నిర్వహించి, మాట్లాడారు. ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో జెండర్ రిసోర్స్ సెంటర్ ప్రారంభం కార్యక్రమంతో పాటు మండలంలోని నెలివాడలో ఈ నెల 10వ తేదీన నిర్వహించిన అంతర్జాతీయ బాలికా దినోత్సవానికి ఎంపీపీ, జెడ్పీటీసీలతో పాటు సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులకు కనీసం సమాచారం ఇవ్వకుండా అధికారులు కార్యక్రమాలు నిర్వహించారన్నారు. ఆయా కార్యక్రమాలకు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కూడా హాజరయ్యారని, రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన ప్రజా ప్రతినిధులను కార్యక్రమాలకు ఆహ్వానించకపోవడం ఏంటని ప్రశ్నించారు. సదరు మంత్రి ఆదేశాలతోనే ఇలా చేశారా అనే అనుమానం కలుగుతోందన్నారు. ఈ విషయంలో వెలుగు, ఐసీడీఎస్ అధికారులు పూర్తిగా నిర్లక్ష్యం వహించారని ఇది ఎంతమాత్రం సరికాదన్నారు.

బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న కెనరా బ్యాంకు జనరల్ మేనేజర్ విజయలక్ష్మి

జామి: మండల కేంద్రంలో కొత్తగా ప్రారంభమైన కెనరా బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోవాలని బ్యాంకు జనరల్ మేనేజర్ విజయలక్ష్మి కోరారు. బ్యాంకు బ్రాంచిని సోమవారం ప్రారంభించినానంతరం ఆమె మాట్లాడారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు బ్యాంకు సేవలు మరింత చేరువ చేయాలన్న లక్ష్యంతో జామిలో కొత్తగా బ్యాంకు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో విజయనగరం రీజనల్ మేనేజర్ కె.వినోద్, ఎంఈవో జయశ్రీ, బ్యాంకు బ్రాంచి మేనేజర్ మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

కుమ్మపల్లిలో పశువైద్య సేవలు


ఆవు చూడి తనిఖీ చేస్తున్న పశువైద్యాధికారిణి గాయత్రి

వేపాడ: మండలంలోని కుమ్మపల్లిలో సోమవారం పశు వైద్యశిబిరం నిర్వహించి, 47 పశువులకు వైద్యసేవలు అందించారు. స్థానిక పశువైద్యాధికారిణి డాక్టర్ గాయత్రి 22 ఆవులకు చూడి తనిఖీలు, 15 పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్సలు, 10 పశువులకు కృత్రిమ గర్భధారణ ఇంజెక్షన్లు చేశారు. పశువుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అప్పుడు పాల ఉత్పత్తి పెరుగుతుదని పాడిరైతులు, పశుపోషకులకు ఆమె సూచించారు.

నకిలీ మద్యంపై.. హోరెత్తిన నిరసనలు!



శృంగవరపుకోట: నకిలీ మద్యాన్ని అరికట్టాలని నినాదాలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, నాయకులు, మహిళా నేతలు


చీపురుపల్లి: నిరసన ర్యాలీలో వైఎస్సార్ సీపీ నాయకులు


చీపురుపల్లి మూడు రోడ్ల జంక్షన్‌లో ర్యాలీని అడ్డుకుంటున్న పోలీసులు

నకిలీ మద్యంపై వైఎస్సార్ సీపీ పోరుబాట పట్టింది. పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపుమేరకు నకిలీ మద్యానికి వ్యతిరేకంగా నియోజకవర్గ కేంద్రాల్లో సోమవారం నిరసన చేపట్టారు. గ్రామాల నుంచి తరలివచ్చిన మహిళలు, పార్టీ శ్రేణులంతా ఎక్సైజ్ కార్యాలయాలను ముట్టడించి మద్యం పాలసీలో కూటమి సర్కారు విధానాలను తప్పుబడుతూ నినాదాలు చేశారు. అధికారంలోకి వస్తే నాణ్యమైన మద్యం ఇస్తామని చెప్పి, విచ్చలవిడిగా కల్తీ మద్యం సరఫరా చేస్తూ ఎక్కడికక్కడ బెల్టుషాపులకు అనుమతి ఇచ్చి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ప్రభుత్వాన్ని దుయ్యబట్టారు. గుడులు, బడులు, జనావాసాల వద్ద మద్యంషాపులు తొలగించాలని, అనధికారికంగా వైన్‌షాపులు పొందిన వారి లైసెన్స్‌లు రద్దు చేయాలని, నకిలీ మద్యంపై ఉక్కుపాదం మోపాలని కోరుతూ అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. శృంగవరపుకోటలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు కడుబండి శ్రీనివాసరావు, శోభా హైమావతి, నాయకులు, మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు. చీపురుపల్లిలో జరిగిన కార్యక్రమంలో పార్టీ పార్లమెంట్ పరిశీలకుడు కిల్లి సత్యనారాయణ, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కేవీ సూర్యనారాయణరాజు, నాయకులు పాల్గొన్నారు. గజపతినగరంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీలు జ్ఞానదీపిక, హైమావతి, జెడ్పీటీసీ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

–గజపతినగరం, శృంగవరపుకోట, చీపురుపల్లి


చీపురుపల్లిలో ఎక్సైజ్ అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు


గజపతినగరం: కల్తీ మద్యాన్ని అరికట్టాలని ప్లకార్డులతో నినాదాలు చేస్తున్న వైఎస్సార్ సీపీ మహిళా నేతలు


జామిలో నకిలీ మద్యాన్ని వ్యతిరేకిస్తూ వైఎస్సార్ సీపీ నాయకుల నిరసన

పంటకోత ప్రయోగం ఆధారంగానే బీమా చెల్లింపు


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డిప్యూటీ ఎస్‌వో రామచంద్ర


గుర్ల: వీఆర్వోలు, వీపీఏలకు సూచనలిస్తున్న తహసీల్దారు ఆదిలక్ష్మి

గంట్యాడ: పంటకోత ప్రయోగం ఆధారంగానే రైతులకు బీమా చెల్లింపు చేయడం జరుగుతుందని డిప్యూటీ ఎస్‌వో రామచంద్ర తెలిపారు. మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రంలో పంటకోత ప్రయోగంపై సిబ్బందికి సోమవారం శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ వరి పొలంలో 5 మీటర్ల పొడవు, 5 మీటర్ల వెడల్పు విస్తీర్ణంలో పంట శాంపిల్స్‌ను తీసుకుని, దిగుబడి అంచనా వేయాలని తెలిపారు. ప్రతిరైతు పంటకోత ప్రయోగం చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి శ్యామ్‌కుమార్, ఏఎస్‌వో రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

గుర్ల: మండలంలోని అన్ని గ్రామాల్లో 80 శాతం వరి పంటకోత ప్రయోగాలు చేపట్టాలని తహసీల్దారు పి.ఆదిలక్ష్మి ఆదేశించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో వీఆర్వో, వీపీఏలతో సమావేశమైన ఆమె..మరో నెల రోజుల్లో వరికోతలు మొదలవుతాయని, పంటప్రయోగం చేసి దిగుబడి అంచనా వేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఏవో నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బైక్ ర్యాలీ


శ్రీకృష్ణ కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ప్రమీలాగాంధీ

గజపతినగరం: సూపర్ జీఎస్టీ..సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా జీఎస్టీ కొత్త శ్లాబ్‌లు, వాటి వల్ల వినియోగదారులకు కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తూ మండల కేంద్రంలో సోమవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ప్రమీలా గాంధీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొని కొత్త శ్లాబ్‌లు, పాత శ్లాబ్‌లు వివరిస్తూ వాటి వల్ల ఏయే వస్తువుల ధరలు ఏ మేర తగ్గాయన్న విషయాలను ప్రజలకు వివరించారు. అనంతరం వెంకటాపురంలోని శ్రీకృష్ణ కళాశాల విద్యార్థులకు జీఎస్టీ వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో బి.కళ్యాణి, ఈవోపీఆర్డీ సుగుణాకరరావు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

చెరువులను తలపిస్తున్న రోడ్లు


వరదనీటితో ప్రధాన రోడ్డు


కాలువలా కనిపిస్తున్న మెంటాడ జంక్షన్ రోడ్డు

గజపతినగరం: మండల కేంద్రంలో సోమవారం ఉదయం భారీ వర్షం కురిసింది. కొన్ని గంటల పాటు ఎడతెరిపి లేకుండా కురిసిన వానకు లోతట్టు ప్రాంతాలు, రోడ్లు, వరదనీటితో నిండిపోయి చెరువులు, కాలువలను తలపించాయి. పెద్దఎత్తున రోడ్లపై వర్షపునీరు ఉండిపోవడంతో రాకపోకలు సాగించేందుకు ద్విచక్ర వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రోడ్డు మీది నీరంతా దిగువ ప్రాంతానికి వెళ్లిపోయిన తర్వాత రాకపోకలు సాగించారు.

దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఏఆర్ వింగ్ ఆధీనంలో ఉండే పోలీసు వెల్ఫేర్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయన్నుట్లు ఎస్పీ దామోదర్ సోమవారం తెలిపారు. ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు తమ విద్యార్హతతో పాటు కచ్చితంగా ఆంగ్ల సబ్జెక్టును బోధన చేయగలిగిన సామర్థ్యం ఉండాలన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 16న ఉదయం పది గంటలకు విజయనగరం కంటోన్మెంట్ పోలీసు క్వార్టర్స్ సమీపంలోని పోలీసు వెల్ఫేర్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో జరిగే ఇంటర్వ్యూలకు, డెమో క్లాసులకు నేరుగా హాజరు కావాలన్నారు. వివరాలకు 6305883484, 9441022875, 9121109485, 9121109484 నంబర్లను సంప్రదించాలని ఎస్పీ సూచించారు.

డ్రగ్స్ బారిన పడొద్దు..


పాఠశాలలో డ్రగ్స్ వద్దు బ్రో చైతన్య కార్యక్రమం

విజయనగరం క్రైమ్: మాదకద్రవ్యాల బారిన పడి బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని ఈగల్ బృందం ఆధ్వర్యంలో జొన్నవలస జెడ్పీహెచ్‌ఎస్‌లో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా హెడ్ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో పలువురు మాట్లాడుతూ విద్యార్థులు మంచి అలవాట్లతో చక్కగా చదువుకొని ఉన్నతంగా ఎదగాలన్నారు. మత్తు పదార్థాల జోలికి వెళ్లి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. ఈగల్ టీమ్ హెడ్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఐజీ ఆకే రవికృష్ణ ఆదేశాల మేరకు సీఐ కల్యాణి సూచనలతో డ్రగ్స్ వద్దు బ్రో కార్యక్రమాన్ని నిర్వహించినట్టు తెలిపారు. కానిస్టేబుళ్లు కోటేశ్వరరావు, వెంకటేష్, లక్ష్మణ తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం

వేపాడ: మండలంలోని చినగుడిపాల గ్రామంలో మాజీ సర్పంచ్ ఎస్.బి.జనాదేవ్ తన సొంత నిధులతో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, డీసీఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణ చేతులమీదుగా సోమవారం ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజలకు ఉచితంగా స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ముందుకురావడం అభినందనీయమన్నారు. ప్లాంట్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఘనంగా నందెన్న ఉత్సవాలు

బొండపల్లి: మండలంలోని నెలివాడ గ్రామ కాపు వీధిలో నందెన్న ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. మండపం వద్ద కొలువు దీర్చిన గంగాగౌరీ సమేత నందీశ్వరునికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం ఆరంభమైన ఈ వేడుకలు నాగుల చవితి వరకు కొనసాగించి ఆ తర్వాత అనుపోత్సవం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదు


ఆందోళన వ్యక్తం చేస్తున్న నిర్వాసితులు

శృంగవరపుకోట: జిందాల్ కంపెనీ తీసుకున్న తమ భూములను తమకు తిరిగి అప్పగించాలని డిమాండ్ చేస్తూ నిర్వాసితులంతా మండలంలోని బొడ్డవర గ్రామంలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష కొనసాగుతోంది. సోమవారం జరిగిన కార్యక్రమంలో తమకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదని నిర్వాసితులు స్పష్టం చేశారు.

వర్షాల వల్ల నష్టం జరిగితే చెప్పండి

దత్తిరాజేరు: భారీ వర్షాల వల్ల ఎక్కడైనా నష్టం జరిగితే తెలియజేయాలని తహసీల్దారు విజయభాస్కర్ కోరారు. ఇదే విషయమై మండల కేంద్రంలోని తన కార్యాలయంలో వీఆర్‌వోలతో సోమవారం సమావేశమయ్యారు. వానలకు గ్రామాల్లోని పశువుల శాలలు, పూరిళ్లు, పెంకుటిళ్లు, శ్లాబ్ ఇళ్లు కూలినట్లయితే వెంటనే సమాచారం అందివ్వాలన్నారు. అలాగే చెరువులకు గండి పడినా విషయం తెలియజేయాలన్నారు.

ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో ఐదో విడత ప్రవేశాలు

- 16లోపు దరఖాస్తుల స్వీకరణ

విజయనగరం అర్బన్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం ఐదో విడత ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ టీవీ గిరి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు ఐటీఐ.ఏపీ.జీవోవి.ఐఎన్ వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 16 మధ్యాహ్నం 2గంటలలోపు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు పూర్తయిన వెంటనే వచ్చే యూనిక్ నెంబర్‌ను ఉపయోగించి అదే తేదీ సాయంత్రం 4 గంటలలోపు సమీపంలోని ఏదైనా ప్రభుత్వ/ప్రైవేటు ఐటీఐకి ఒరిజినల్ సర్టిఫికెట్లతో వెళ్లి వెరిఫికేషన్ పూర్తి చేసుకోవాలని సూచించారు. కౌన్సెలింగ్ ప్రక్రియ ఈ నెల 17 ఉదయం 9 గంటలకు సంబంధిత ప్రభుత్వ/ప్రైవేటు ఐటీఐలలో నిర్వహిస్తామని తెలిపారు. పూర్తి వివరాల కోసం 9441518355, 9849944654 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

నిరుపయోగంగా మరుగుదొడ్లు



కొత్తవలస మండలంలోని బలిఘట్టాం గ్రామ సచివాలయం వద్ద నిర్మించిన మరుగుదొడ్లు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. పౌరసేవల నిమిత్తం సచివాలయానికి వచ్చే వారు, సిబ్బంది కోసం గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో వీటిని నిర్మించారు. వాటి నిర్వహణను సిబ్బంది గాలికొదిలేయడంతో ఎవరూ వినియోగించడానికి వీలుకాని విధంగా అధ్వానంగా తయారయ్యాయి. తుప్పలు, డొంకలు వాటి చుట్టూ పెరిగి, అందులోకి వెళ్లలేని విధంగా ఉన్నాయి. అధికారులు స్పందించి, వాటిని ఉపయోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

–కొత్తవలస

తాగునీరు వృథా..



కొత్తవలస మేజర్ పంచాయతీ పరిధిలోని పలు వీధుల్లోని తాగునీటి కుళాయిల ద్వారా తాగునీరు వృథాగా పోతోంది. పైపులైన్ లీకేజీకి గురవ్వడం, కుళాయిలకు కంట్రోలింగ్ వాల్వ్‌లు లేని కారణంగా తాగునీరు రోడ్డుపాలవుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి, నీటి వృథాను అరికట్టాలని కోరుతున్నారు. విజయనగరం రోడ్డులోని చింతలదిమ్మ వద్ద కుళాయి నుంచి బయటకు పోతున్న తాగునీటిని ఈ చిత్రంలో చూడొచ్చు.

–కొత్తవలస

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ అమలు చేయాలి



ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ అమలు చేయాలని బహుజన కళామండలి సభ్యుడు దప్పు రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దళితుల హక్కుల సాధనకై ఈ నెల 17న శృంగవరపుకోట జంక్షన్ వద్ద చేపట్టనున్న మహాధర్నా వాల్‌పోస్టర్‌ను వేపాడ మండలంలోని ఆతవ గ్రామంలో సోమవారం ఆవిష్కరించారు. దళిత వాడల్లో గుడులు కాదు బడులు నిర్మించాలని, ఎస్సీ కార్పొరేషన్ రుణాలు మంజూరు చేయాలని, అట్రాసిటీ యాక్ట్‌లోని 41వ సెక్షన్ రద్దు చేయాలన్నారు. అలాగే మహాధర్నాను విజయవంతం చేయాలని కోరారు.

–వేపాడ

రుషికొండ ప్యాలస్‌ను మ్యూజియంగా తీర్చిదిద్దాలి


వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న యువ సమ్మేళనం ప్రతినిధులు

విజయనగరం టౌన్: విశాఖ రుషికొండ ప్యాలెస్‌ను శాస్త్ర, సాంకేతిక, సాంస్కృతిక మ్యూజియంగా తీర్చిదిద్దాలని యువ సమ్మేళనం ప్రతినిధులు కె.అభిమన్యు కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలో దీనికి సంబంధించి వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ రూ.వందల కోట్ల ప్రజాధనంతో నిర్మించిన భవనం వృథా కారాదన్నారు. వ్యాపార కేంద్రంగా వినియోగించడం వలన ప్రయోజనకరంగా ఉండదని, అందుకు ఎన్నో అవకాశాలున్నాయన్నారు. భావి యువతకు, విద్యార్థులకు విజ్ఞాన మార్గదర్శిగా నిలపాలన్నారు. ఆంధ్ర రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలను, చరిత్రను చాటిచెప్పే వేదిక కావాలన్నారు. రాజకీయ అవసరాలకు రచ్చ చేయకుండా, స్వార్థ ప్రయోజనాలకు వినియోగించకుండా జాతికి అంకితం చేయాలన్నారు. మ్యూజియం ఏర్పాటుకు మద్దతునిచ్చే ప్రజలు తమ అభిప్రాయాలను రుషికొండ ఎట్‌ది రేట్ ఆఫ్ ఎపిడిటిసి డాట్ ఇన్‌కు అక్టోబరు 17లోపు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో సభ్యులు ప్రశాంత్, శ్రీకాంత్, దివ్య, ఇషాక్, తేజ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన అన్నమాచార్య కీర్తనలు


అన్నమాచార్య కీర్తనాలాపన చేస్తున్న డాక్టర్ పెన్నేటి స్వప్న హైందవి

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం శ్రీ పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి చదురుగుడి ప్రాంగణంలో ఉన్న ఆధ్యాత్మిక కళావేదికపై రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, వంగిపురం రామానుజాచార్య పురస్కార గ్రహీత, రాజాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పెన్నేటి స్వప్నహైందవి నిర్వహించిన అన్నమాచార్య సంకీర్తనాలాపన అలరించింది. కంచికామకోటి పీఠం ఆస్థాన విద్వాంసులు డాక్టర్ మండపాక రవి మృదంగంపైన, రామ్‌చరణ్ వయోలిన్‌పై సహకారమందించారు. అనంతరం ఆలయ అధికారులు దుశ్శాలువతో కళాకారులను ఘనంగా సత్కరించారు.

మహిళల రక్షణ కోసమే శక్తి యాప్


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి బబిత

విజయనగరం లీగల్: ప్రతీ ఒక్కరూ శక్తి యాప్‌ను వారి మొబైల్‌ఫోన్‌లో డౌన్ లోడ్ తప్పనిసరిగా చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.బబిత అన్నారు. మహిళల రక్షణ కోసం సోమవారం జిల్లా కోర్టులో పని చేస్తున్న మహిళా సిబ్బందికి న్యాయ అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ యాప్ ద్వారా మహిళలు ఎక్కడ ఏ పరిస్థితుల్లో ఉన్నప్పటికీ అత్యవసర రక్షణ లేదా సహాయం కావాలంటే ఈ యాప్‌ను వినియోగించి వారికి పోలీస్ శాఖ ద్వారా రక్షణ అందుతుందన్నారు. విజయనగరం మహిళా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కె.నరసింహమూర్తి, మహిళా పోలీస్‌స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ శిరీష యాప్ డౌన్‌లోడ్ ఎలా చేసుకోవాలో, ఏ విధంగా వినియోగించుకోవాలన్నది తర్ఫీదు ఇచ్చారు. అదే విధంగా బాలబాలికలు మిస్సింగ్ అయినా ఈ యాప్ ద్వారా రక్షణ పొందవచ్చునన్నారు.

16 ఆలయ వార్షికోత్సవం

బొండపల్లి: మండలంలోని గొట్లాం గ్రామ షిర్డీ సాయిబాబా ఆలయ 24వ వార్షికోత్సవం ఈ నెల 16వ తేదీన నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు, పిరమిడ్ సేవా దళ్ జిల్లా కన్వీనర్ వి.రామకృష్ణరాజు ఓ ప్రకటనలో సోమవారం తెలిపారు. ఆరోజు ఆలయంలో ప్రత్యేక పూజల నిర్వహణతో పాటు అన్నదానం చేయనున్నామని పేర్కొన్నారు. భక్తులంతా హాజరుకావాలని కోరారు.